

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 127 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ శుక్రవారం 6-12-2024 వెల: 5/రూ -

## చిన్న పరిశ్రమలకు పెద్దపీట

హైదరాబాద్: రాష్ట్రంలో భారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తూనే అవకాశమున్న చోట సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) పెద్దపీట వేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో పారిశ్రామిక, ఐటీ రంగాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతి, నూతన ప్రణాళికలను వివరించారు.

డిజిటల్ హెల్త్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

డ్రగ్స్ నియంత్రణకు వేయి రూరల్ స్కూళ్లలో స్పెషల్ యాప్

ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి



2లో



## ధాన్యం కొనుగోలులో దళారులొద్దు

ధాన్యం కొనుగోలులో దళారులొద్దు

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా

దీపం-2పై మరింత ఫోకస్: మంత్రి నాదెండ్ల

2లో



## దుర్మార్గ పాలనపై పోరాటం

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

ఆరు నెలల్లోనే ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో తిరోగమనం

ఫీజులందక విద్యార్థులకు ఇక్కట్లు

ఆరోగ్యశ్రీ నిర్వీర్యం.. పడకేసిన 'ఫ్యామిలీ డాక్టర్'

2లో



## అదానీపై ఆగని రగడ!

పార్లమెంటు ఆవరణలో విపక్షాల వినూత్న నిరసన

జేపీసీ వేయాలని డిమాండ్

## 'తెలంగాణ తల్లి' విగ్రహావిష్కరణకు కేసీఆర్‌నూ పిలుస్తాం

### సభలో విపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండడం మంచిది కాదు

అధికార, ప్రతిపక్షాలంటే భారత్, పాకిస్థాన్‌లా ఉంది!

ఇరు పక్షాలనూ శత్రు సైనికుల్లా మార్చింది కేసీఆరే

ఇకనైనా అసెంబ్లీకి రావాలి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి

పక్క పిల్లాడి బొమ్మలు విరగ్గొట్టే పిల్లల్లా హరీశ్, కేటీఆర్

ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఆవిష్కరణలో సీఎం రేవంత్

కాంగ్రెస్‌తో టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!: మహేశ్‌గౌడ్

హస్తం పార్టీలోకి సోయం బాపూరావు, ఆత్రం సక్కు



అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండడం రాష్ట్రానికి మంచిది కాదని సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హితవు పలికారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అధికార, విపక్షాలు అంటే భారత్-పాకిస్థాన్ మాదిరిగా కొట్లాడుకునే వైరి వర్గాల తరహాగా తయారైందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

హైదరాబాద్: శాసనసభ శీతాకాల సమావేశాలకు కేసీఆర్ హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రజల సమస్యలపై సభలో చర్చ పెట్టాలని.. ఆయన చతురతను, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా

2లో



## అల్లు అర్జున్‌పై కేసు

ఆయన భద్రతాసిబ్బందితోపాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైనా!

మహిళ మృతి నేపథ్యంలో..

బీఎన్ఎస్‌లోని నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదు

అల్లు అర్జున్ వస్తున్నట్టు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు: పోలీసులు

నేరం రుజువైతే పదేళ్లదాకా జైలు!

చిక్కడపల్లి/కవాడిగూడ, డిసెంబరు 5: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో..

2లో



## సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి

డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే అజిత్ పవార్ ప్రమాణం

## చట్టం కాంగ్రెస్ చుట్టమా?

గాంధీభవన్లో ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయి

పోలీస్‌స్టేషన్లు కాంగ్రెస్ కార్యాలయాలయ్యాయి

2లో

ఎవర్ని అరెస్టు చేయాలో గాంధీభవన్‌లోనే డిసైడ్

రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన

పోలీస్‌రాజ్యం చేసిన ఏ ప్రభుత్వమూ నిలబడలే

12 గంటలైనా కౌశిక్‌కు బెయిల్ ఎందుకు ఇస్తలేరు?

బీఆర్ఎస్ నేతలందరినీ వెంటనే విడుదల చేయాలి

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్ : రాష్ట్రంలో చట్టం కాంగ్రెస్ పార్టీకి చుట్టంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ కార్యాలయాలుగా మారాయని, గాంధీభవన్‌లో ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయని,

# అల్లు అర్జున్‌పై కేసు

(మొదటి పేజీ తరువాయి)

సినీ నటుడు అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైన, అల్లు అర్జున్ సెక్యూరిటీ సిబ్బందిపైనా భారత న్యాయ సంహితలోని సెక్షన్ 105 (హత్య కిందకు రాని ప్రాణనష్టం కేసుల్లో పెట్టే సెక్షన్), 118(1) (ప్రమాదకరంగా వ్యవహరించడం ద్వారా వేరే వ్యక్తులు గాయపడేందుకు కారణం కావడం) వంటి నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. ఈ తరహా కేసుల్లో నేరం రుజువైతే గరిష్ఠంగా పదేళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది (గతంలో సల్మాన్‌ఖాన్‌పై పెట్టిన ఐపీసీ 304 సెక్షన్ బీఎన్ఎస్‌లోని సెక్షన్ 105తో సమానం). ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో రేవతి(39) అనే మహిళ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ తొక్కిసలాటలో మరికొంతమందికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పోలీస్ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రీమియర్ షో వీక్షించడానికి హీరో అల్లు అర్జున్ వస్తున్నట్లు సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని.. హీరో థియేటర్‌లోకి ప్రవేశించడానికి అనువుగా ఉండేలా ప్రత్యేక ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయలేదని డీసీపీ తెలిపారు. అభిమానులను నియంత్రించే ఏర్పాట్లుగానీ.. ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలుగానీ తీసుకోలేదని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు భద్రతా సిబ్బందితో థియేటర్ వద్దకు వచ్చిన అల్లు అర్జున్ నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా సమీపంలోని క్రిస్టల్ హోటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో అభివాదం చేసుకుంటూ లోపలికి వచ్చారని.. ఆయన్ను చూడటానికి, సెల్ఫీలు దిగడానికి అభిమానులు పెద్ద ఎత్తున ఎగబడటం, వందలాది మంది ఒక్కసారిగా చొచ్చుకురావడంతో తొక్కిసలాట జరిగినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో మరణించిన రేవతి భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా.. రేవతి మృతదేహానికి గురువారం సాయంత్రం పోస్టుమార్టం పూర్తయ్యిందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామని వివరించారు.

# అదానీపై ఆగని రగడ!

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: అదానీ ముడుపుల వ్యవహారంపై విపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. అమెరికా చేసిన ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాల్సిందేనని గురువారం సైతం కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీల ఎం పీలు వినూత్న నిరసన చేపట్టారు. 'మోదీ అదానీ ఏక్ హై.. అదానీ సేఫ్ హై' అనే నినాదంతో ఉన్న జాకెట్లు, టీషర్టులు ధరించి ఆందోళన చేశారు. మోదీ, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో సహా కాంగ్రెసతోపాటు విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఇటు లోక్‌సభలోనూ విపక్షాల ఆందోళనలు కొనసాగాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. తొలుత సభలో రాహుల్ మాట్లాడుతూ.. అదానీపై మోదీ విచారణ జరపలేరని.. అదానీపై విచారణ జరపడమంటే మోదీ తనపై తానే చేసుకున్నట్లుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. దీనిపై అధికార పక్ష ఎంపీలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపారు. ఇంతలోనే స్పీకర్ ఓం బిర్లా కలుగజేసుకుని మకర ద్వారం వద్ద విపక్షాల ఆందోళనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల తీరుపై పార్లమెంటరీ పార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా మండిపడ్డారు. రాహుల్ తీరుపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్‌గాంధీ దేశ ద్రోహి అని ఆ పార్టీ ఎంపీలు నిషికాంత్ దూబే, సాంబిత్ పాత్రా మండిపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలకు విపక్షాలు అంతరాయం కలిగిస్తున్నాయంటూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రాహుల్‌పై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. కొత్త బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం.. హిందీ రాని వారిపై కూడా ఆ భాషను రుద్దడమేనంటూ రాజ్యసభలో కేంద్రంపై విపక్ష సభ్యులు మండిపడ్డారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టిన 'భారతీయ వాయుయాన్ విధేయక్-2024' బిల్లుపై గురువారం చర్చ జరిగింది.

# సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ముంబై: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు, వేలాదిమంది జనం మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణం చేశారు. గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఫడణవీసతో ప్రమాణం చేయించారు. అనంతరం, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే (60), అజిత్‌పవార్ (65) ప్రమాణం చేశారు. శిందే ప్రమాణం చేయటానికి ముందు.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రేలకు కృతజ్ఞతలు తెలుపుతూ కొద్దిసేపు ఉపన్యసించారు. గవర్నర్ ప్రమాణం చేయించడానికి ఉద్యుక్తులవటంతో.. ప్రసంగాన్ని ఆపి ప్రమాణం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంల ప్రమాణంతో.. రెండు వారాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ ముగ్గురు మినహా మిగిలిన మంత్రులు ఎవరూ ప్రమాణ స్వీకారం చేయలేదు. శాసనసభ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. ఈ నెల 23న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ-శివసేన-ఎన్సీపీ కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నప్పటికీ.. సీఎం పదవి కోసం ఏక్‌నాథ్ శిందే పట్టుబట్టటంతో సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. పలు పర్యాయాల సంప్రదింపులు, చర్చల అనంతరం శిందే.. బీజేపీకే సీఎం పదవి ఇవ్వటానికి అంగీకరించారు. 54 ఏళ్ల ఫడణవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయటం ఇది మూడోసారి. 2014లో తొలి పర్యాయం ఐదేళ్లపాటు సీఎంగా పదవిలో కొనసాగిన ఆయన, 2019లో రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ.. ఉద్ధవ్ ఠాక్రే మద్దతు ఉపసంహరణతో ఐదు రోజుల్లోనే రాజీనామా చేశారు.

# చట్టం కాంగ్రెస్ చుట్టమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎవరిని అరెస్టు చేయాలో అక్కడే నిర్ణయిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ పాలన ఇందిరాగాంధీ రాజ్యంలోని ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నదని విమర్శించారు. పోలీసులతో రాజ్యమేలిన ఏ ప్రభుత్వం కూడా ముందుకుపడలేదని గుర్తుచేశారు. గురువారం ఉదయం కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు ఆయనను అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8 గంటల సమయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తెచ్చిన మార్పు నిర్బంధాలు, అక్రమ అరెస్టులే తప్ప మరేమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏ నిరుద్యోగ యువతకు అయితే మాట ఇచ్చారో అదే యువతను అశోక్‌నగర్‌లో వీపులు పగేలాలా కొట్టించారు. గిరిజనులకు గొప్ప మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి రాత్రిపూట గిరిజనుల మీద దాడి చేయించారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఎమర్జెన్సీ పాలన తెచ్చారు. ఆడవాళ్లను పోలీసు బూటుకాళ్లతో తొక్కిపట్టి వారి భర్తలను అరెస్టు చేశారు. ఇప్పటికీ వారందరూ జైలు నిర్బంధంలో ఉన్నారు. పోలీసులతో రాజ్యమేలిన ఏ ప్రభుత్వం కూడా ముందుకు పడలేదు. పోలీసులను అతిగా ప్రయోగించిన ప్రభుత్వాన్ని కూడా ప్రజలు సహించలేదు. ఇందిరమ్మ లాంటి వాళ్లను సైతం కూకటివేళ్లతో పెకిలించిన దేశం భారతదేశం' అని హరీశ్‌రావు హెచ్చరించారు. %కాంగ్రెస్ పార్టీ ఆఫీసులుగా ఠాణాలురేవంత్‌రెడ్డి ప్రతిపక్షాల గొంతు నొకాలని, ప్రశ్నించే గొంతులను అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. 'పోలీస్‌స్టేషన్లు అన్నీ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులుగా మారిపోయాయి.

# ధాన్యం కొనుగోలులు సాఫీగా సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి, డిసెంబర్: ఏపీలో ధాన్యం కొనుగోలుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగాఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.1.51 లక్షల మంది రైతులకు రూ.2,331 కోట్ల చెల్లింపులు జరిగినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. గతేడాది ఈ సమయానికి.. 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం ఒక రికార్డు అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. వరి కోతలకు ఎక్కువగా యంత్రాలు ఉపయోగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ధాన్యం మిల్లులకు రావడంతో రద్దీ ఎక్కువైంది. తేమ శాతంలో గందరగోళం ఏర్పడింది. నిబంధనల ప్రకారం తేమ శాతం 17 అయితే.. దీనికి మరో 5 శాతం కలిపి రైతులకు మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను ప్రభుత్వం ఆదేశించింది.

# ధాన్యం కొనుగోలులో దళారులొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతులకు అన్నివిధాలుగా అండగా నిలవాలని అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. మధ్యవర్తుల ప్రమేయం ఉన్నట్లు తేలితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కొనుగోలు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగాలని, బుకింగ్ నుంచి కొనుగోలు ముగిసేంత వరకూ ప్రతి విషయం రైతులకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు పూర్తయిన 24 గంటల నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందని చెప్పారు.

# చిన్న పరిశ్రమలకు పెద్దపీట

అరులో ఐదింటిని ఎంఎస్‌ఎంఈల కోసం అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కుల్లో ఒక దానిని మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయించడంతోపాటు కొత్త పార్కుల్లో ఐదు శాతం ప్లాట్లు మహిళలకు కేటాయిస్తామని చెప్పారు. కొన్ని ప్లాట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామని, వారికోసం ప్రత్యేక విధానం తీసుకొస్తామని వెల్లడించారు. 'మాదకద్రవ్యాలతో పొంచి ఉన్న ప్రమాదంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం రూపొందించిన 'డ్రగ్ అబ్యూజ్ యాప్'ను వేయి గ్రామీణ స్కూళ్లలో వినియోగిస్తాం. చిన్న, సన్న కారు రైతులకు 48 గంటల్లోపు రూ.లక్ష వరకు రుణం లభించేలా రూపొందించిన యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న ప్రారంభిస్తారు'అని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సత్వరం అనుమతులు లభించేలా సరళీకరణ విధానాలను అమలుచేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'ఏడాది కాలంలో టీజీఐపాస్ ద్వారా రూ.6,347.59 కోట్ల విలువైన 1,539 యూనిట్లకు అనుమతులిచ్చి 35,724 మందికి ఉపాధి కల్పించాం.

# 'తెలంగాణ తల్లి' విగ్రహావిష్కరణకు కేసీఆర్‌నూ పిలుస్తాం




(మొదటి పేజీ తరువాయి)

పని చేసిన అనుభవాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, పొన్నం, జూపల్లి కృష్ణారావులతో కలిసి 'ఇందిరమ్మ ఇళ్ల యాప్'ను ఆవిష్కరించిన సీఎం.. పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు కల వకుండా చేసింది కేసీఆరేనని.. ఇరు పక్షాలనూ శత్రు దేశ సైనికుల్లా మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటిక్కైనా ఆయనలో మానసిక పరివర్తన రావాలని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత వైఎస్.. ఆయన సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు.. ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని రేవంత్ గుర్తుచేశారు. అంతేకాదు.. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్నప్పుడే ఆయన్ను హరీశ్ కలిశారని.. మరి ఇప్పుడేమైందని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని పేర్కొన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎన్ని ఉన్నా.. తమ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో మాత్రం పార్టీలకు అతీతంగా నేతలంతా ఏకమవుతారని.. ఇక్కడ కూడా అలానే కావాలని అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్ర ఎంపీలకు (17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు) సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ఆహ్వానించారు. తాము అభివృద్ధి.. సంక్షేమం రెండింటినీ సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే కేటీఆర్, హరీశ్ చిన్నపిల్లల్లా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేయలేనిది తాము ఏడాదిలోనే చేస్తుంటే.. హోం వర్క్ చేయని పిల్లలు చేసిన పిల్లాడి నోట్సు చింపేసినట్టుగా.. పక్కవాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్నపిల్లల్లా.. వారిద్దరూ ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తాము చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని మారీచ, సుబాహుల్లా, రాహుకేతువుల్లా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్దవారని, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సూచించారు. సచివాలయంలో 9వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కేసీఆర్‌నూ ఆహ్వానించనున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. అలాగే.. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను కూడా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేతగా వచ్చి కేసీఆర్ తన పెద్దరికాన్ని నిలుపుకోవాలని సూచించారు. 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం.. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహిస్తామని.. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లు అందులో ఉంటాయని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఆవిష్కరించిన సీఎం.. ఈ పథకం కింద ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు ఇస్తున్నామని.. దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు. 2004 నుంచి 2014 వరకు.. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే.. కేసీఆర్ సర్కారు గడిచిన పదేళ్లలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించి కేవలం 65వేల ఇళ్లను మాత్రమే పూర్తిచేసిందని విమర్శించారు.

# దుర్మార్గ పాలనపై పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: 'రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దుర్మార్గ పాలన వల్ల ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా పెరిగింది. ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీద్దాం.. అరాచక పాలనపై పోరాటం చేద్దాం' అని పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల పార్టీ ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై మార్గ నిర్దేశం చేశారు. 'మనం కేవలం చంద్రబాబుతో మాత్రమే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లాంటి చెడిపోయిన వ్యతిరేక మీడియాతో యుద్ధం చేస్తున్నాం. ఇంత మంది కలిసి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలంటే వాళ్ల కంటే మనం బలంగా తయారు కావాలి. అలా జరగాలంటే ప్రతి కార్యకర్త విప్లవ స్ఫూర్తితో పని చేయాలి' అంటూ దిశా నిర్దేశం చేశారు. 'మోసంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజల కోపానికి గురికాక తప్పదు. అప్పుడు వాళ్లు ఎంత దూరంలో పడతారంటే.. టీడీపీకి సింగిల్ డిజిట్ కూడా రాని రోజులు మనం చూస్తాం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..చంద్రబాబు ప్రభుత్వం వచ్చి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. అంతలోనే ఇంత తీవ్రమైన వ్యతిరేకత వచ్చిన పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. తొలిసారిగా చూస్తున్నాం. ఇలాంటి నేపథ్యంలో మనమంతా కలిసికట్టుగా ఏం చేయాలని ఆలోచన చేసి ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం. మన ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారు. ఇవ్వాళ్టికి కూడా మన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు ఏ గ్రామానికైనా, ఏ ఇంటికైనా ఈ మంచి చేశామని చెబుతూ గర్వంగా తలెత్తుకుని వెళ్లగలరు.కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసిందని మనం సగర్వంగా చెప్పగలం. మామూలుగా రాజకీయ పార్టీలు ఎన్నికల్లో మేనిఫెస్టో అని రంగు, రంగుల కాగితాలు ఇచ్చి.. దాన్ని ఎన్నికలు అయిపోగానే చెత్తబుట్టలో పడేసే పరిస్థితి. ఆ పరిస్థితి నుంచి... తొలిసారిగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను మనం తూచ తప్పకుండా అమలు చేశాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ... అందులో 99 శాతం వాగ్దానాలు అమలు చేశాం.

బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడే ఏ పథకం ఏ నెలలో ఇస్తామో ముందుగానే చెప్పడంతో పాటు సంక్షేమ కేలండర్‌ను విడుదల చేశాం. ఆ మేరకు క్రమం తప్పకుండా ఆ నెలలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశాం. చరిత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే ఇలా జరిగింది. ఆ రకమైన మంచి మనం చేశాం. ప్రతి ఇంటికీ మంచి చేసినా కూడా ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. అందుకు కారణాలు ఏమైనా వాటిని పక్కన పెడితే.. మనకు గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు వస్తే.. ఈ సారి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్ ప్రతి ఇంటికి పలావు పెట్టాడు.. కానీ చంద్రబాబు బిర్యానీ పెడతానన్నాడు కాబట్టి పొరపాటున చేయి అటు వైపు పోయింది.

# రూ.5.65 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 145 గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులకు అనుమతి

**కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడి.**

**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా బదులిచ్చిన మంత్రి**

**ఢిల్లీ/ ఏలూరు, డిసెంబరు 5: (డైలీ రిపోర్ట్)::** కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు, అంత కంటే ఎక్కువ ఖర్చుతో రూ. 5.65 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 145 ప్రాజెక్టులను ఆమోదించిందని, వీటిలో రూ.2.84 లక్షల కోట్ల వ్యయంతో 78 నూతన గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, రూ.2.81 లక్షల కోట్ల వ్యయంతో 67 బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నట్లు కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించారు.దేశంలో ఆయిల్, నేచురల్ గ్యాస్ కంపెనీల ద్వారా గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు అనుమతులు, ప్రాజెక్టుల స్థాపనలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనీలను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి హర్దీప్ సింగ్ పూరి లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత చమురు, గ్యాస్ కంపెనీ బోర్డులు నిర్ణయం తీసుకుంటాయని, తద్వారా ప్రభుత్వ పాత్ర సులభతరం చేశామని, గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు వాటి స్వభావాన్ని బట్టి పర్యావరణం, అటవీ, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (CRZ), వన్యప్రాణుల క్లియరెన్స్ తీసుకోవాలని, భూ సేకరణ, మార్గం హక్కు (ROW), వినియోగ హక్కు (ROU), పేలుడు, భద్రతకు సంబంధించిన అనుమతులు తీసుకోవాల్సి ఉందని మంత్రి సమాధానం ఇచ్చారు. 2014 నుండి రూ.4.86 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రూ.100 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయంతో మొత్తం 379 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వీటిలో రూ.2.52 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 225 గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులు కాగా, రూ.2.34 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 154 బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు ఉన్నాయని మంత్రి తెలిపారు.ఆయిల్ & గ్యాస్ %ఖూాజు%ల ప్రాజెక్ట్‌ల అమలు స్థితిని అంచనా వేయడానికి పటిష్టమైన ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్ కలిగి ఉందని, ఆన్‌లైన్ ప్రాజెక్ట్ మానిటరింగ్ పోర్టల్ (www.pariyojana.gov.in%) ద్వారా



ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం కోసం ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి బదులిచ్చారు.





## మొయినాబాద్, చిలుకూరు గురుకులాలను తనిఖీ చేసిన ఐఏఎస్ అలుగు వర్షిణి మరియు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య.

చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం చిలుకూరు మరియు మొయినాబాద్ లో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలను తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులాల ముఖ్య కార్యదర్శి అలుగు వర్షిని మరియు స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి పౌష్టికాహారం అలాగే ఆహారం ఆహార నాణ్యత గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకొని వారితో పాటు భోజనం చేశారు...ఈ సందర్భంగా మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య విద్యార్థులతో అన్నారు.

## మంత్రి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ యువకులు

**రాయికోడ్ డిసెంబర్,5 డైలి రిపోర్ట్:** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ గారి పుట్టిన రోజు సందర్భంగా రాయికోడ్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కలశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ వీరాభిమానులు, కాంగ్రెస్ పార్టీ యువనాయకులు ఈ సందర్భంగా విద్యార్థులతో కాంగ్రెస్ పార్టీ యువనాయకులు మాట్లాడుతూ మన నియోజక వర్గం నుండి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న మండలములో ఉన్న మనం విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండి రాష్ట్రములో రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని విద్యార్థులతో తెలిపారు. అంతే కాకుండా నేటి బాలలే రేపాటి పౌరులు అని విద్యార్థులకు తెలియజేశారు. దేశాన్ని ,అబివృద్ధి దిశగా తీసుకెళ్లెది చదువు ఒక్కటే అన్నారు.ఎప్పుడైతే విద్యని అభ్యసిస్తమో అప్పుడే రాష్ట్రములో,దేశములో పాలన పట్ల ప్రశ్నించగలుగుతాము అన్నారు. మనం ఒక్క గొప్ప స్థాయిలో ఉండాలన్న విద్య ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమములో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## నెహ్రూ యువ కేంద్ర ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాలంటీర్ డే

**విజయవాడ డైలీ రిపోర్ట్ ,డిసెంబర్ 5** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం మాచవరం ఎస్సార్ ఆర్ సివిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు ఈరోజు ఇంటర్నేషనల్ వాలంటీర్ డే ను ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమం సందర్భంగా డిస్టిక్ ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ వాలంటరీలు అనేవాళ్లు ఎల్లప్పుడూ సమాజం పట్ల నైతిక భావంతో ఉంటారని వాలంటరీల ఉదారమైన సేవలు అందరు గుర్తించాలని నెహ్రూ యువ కేంద్రంలో వాలంటీర్లు ఒక క్రమశిక్షణతో పని చేస్తారని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో సమన్వయం చేసుకొని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వరద సహాయ కార్యక్రమాలు డిజాస్టర్ సహాయక కార్యక్రమాలు ఇలా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని ఎల్లప్పుడూ ఈ వాలంటరీ ఇజం ఇలాగే కొనసాగాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సేవలు అందించిన వాలంటీర్లు అందరికీ నెహ్రూ యువ కేంద్రం మరియు ఎన్ఎస్ఎస్ తరఫున సర్టిఫికెట్స్ జారీ చేయడం జరిగింది. అలానే ప్రధానమంత్రి మోడీ తలపెట్టిన యంగ్ డైలాగ్ కార్యక్రమంలో పార్టిసిపెషన్ చేయడానికి అనేకమంది విద్యార్థులలో పోర్టల్ లో రిజిస్టర్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకులు బి వినోద్ కుమార్ ఎన్ఎస్ఎస్ నిర్వహకులు బాలసుబ్రమణ్యం లెక్చరర్ యు రమణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






## దామోదర రాజనరసింహ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపిన కాంగ్రెస్ పార్టీ యువనాయకులు




**రాయికోడ్ డిసెంబర్,5 డైలీ రిపోర్ట్:** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ గారి జన్మదిన వేడుకలు ఘనంగా రాయికోడ్ మండల కేంద్రమైన చిమ్నపూర్ చౌరస్తా వద్ద మొహమ్మద్ మాక్సుదు ఫామౌజులో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చెయ్యడం జరిగింది. ఈ శుభసందర్భములో రాయికోడ్ మండల పరిధిలో ఉన్న వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ యువనాయకులు మాట్లాడుతూ ఆందోల్ ను అభివృద్ధి దిశగా నడిపించే ఏకైక వ్యక్తి దామోదర రాజనరసింహ మాత్రమే అన్నారు.గత 30 సంవత్సరాల నుండి అందోల్ అబివృద్ధి చేసింది మంత్రి దామోదర రాజనరసింహ ఒక్కరే అన్నారు.అంతే కాకుండా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. ఒక్కదిక్కు తెలంగాణ రాష్ట్రానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తూ రాయికోడ్ మండలాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తున్న ప్రజ నాయకుడు అన్నారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకుంటూ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో కలకలం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమములో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ సర్పంచ్ లు యువనాయకులు వీరాభిమానులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులకు శుభాకాంక్షలు

**రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్**

**శంకర్‌పల్లి: డిసెంబర్ 05:(డైలీ రిపోర్ట్):** ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఆన్ లైన్ ఓటింగ్ ఫలితాలను విడుదల చేశారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులుగా మోత్కుపల్లి మహిపాల్ యాదవ్, నియోజకవర్గంలోని ఐదు మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా చేవెళ్ల - కార్తీక్ రెడ్డి, షాబాద్ - సురేందర్, నవాబ్ పేట - శేఖర్, శంకర్‌పల్లి - ప్రశాంత్ రెడ్డి, మొయినాబాద్ - విగ్నేష్ రెడ్డి లు భారీ మెజార్టీతో గెలిచారు. నూతనంగా గెలిచిన అభ్యర్థులందరికీ రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్ శుభాకాంక్షలు తెలిపారు.



# ఆరు గ్యారెంటీలు అరవై మోసాలు ఇదే కాంగ్రెస్ నైజం

**100 రోజుల్లో హామీల అమలు ఎటుపాయె..?**

**వృద్దులకు 4 వేల పెన్షన్, ఆడబిడ్డల పెళ్ళిళ్లకు తులం బంగారం ఏమాయే**

**కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై డిప్యూటీ తహసిల్దార్ కు బీజేపీ నేతల ఫిర్యాదు**

**శంకర్‌పల్లి: డిసెంబర్ 05: (డైలీ రిపోర్ట్):** రు గ్యారెంటీలు 60 మోసాలతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తుందని బీజేపీ నేతలు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని గురువారం పట్టణ చౌరస్తా నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శంకర్‌పల్లి డిప్యూటీ తహసిల్దార్ ని మర్యాదపూర్వకంగా కలసి బిజెపి నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎడాది గడుస్తున్నా ఇప్పటి వరకు హామీలను అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలు అరవై మోసాలు ఇదే కాంగ్రెస్ నైజం అన్నారు. 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తిరుతాం అని చెప్పిన మాటలు ఎటుపాయె అని ప్రశ్నించారు. వృద్ధులకు 4 వేల పెన్షన్, ఆడబిడ్డల పెళ్ళిళ్లకు తులం బంగారం ఏమాయే అన్నారు. 6 గ్యారంటీలు కాస్త 60 మోసాలుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏం చేశారని ఏడాది పాలనలో ఏమి సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హామీలను అమలు చేసేవరకు ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని స్పష్టం



చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మోకిల మాజీ సొసైటీ డైరెక్టర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బండమీది వెంకటేష్, మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా, ఎస్టి మోర్చా ప్రెసిడెంట్ కిషన్ నాయక్, మాజీ ఎంపీపీ నర్సింలు, నాయకులు డా. వైభవ్ రెడ్డి, భయానంద్, బాబు నాయక్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

